



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 591 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 20 గురువారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం





## జల్ జీవన్ మిషన్‌కి బీజం వేసింది

# భగవాన్ శ్రీ సత్యసాయి బాబా

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేటి సంకల్పానికి నాడు శ్రీ బాబా వారు అంకురం వేశారు
- నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వపరమైన అనుమతులు ఇచ్చారు
- సేవాతత్పరతతో ఎంతో మందిని ప్రభావితం చేసిన ఆధ్యాత్మిక శక్తి శ్రీ సత్యసాయి బాబా వారు
- ఆధ్యాత్మిక తేజస్సు, విశ్వప్రేమ వల్లే అది సాధ్యపడింది
- శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి ఉత్సవాల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పుట్టపర్తి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 19 :
ప్రతి మనిషికీ రోజుకి కనీసం 55 లీటర్ల రక్షిత తాగునీరు ఇవ్వాలన్నది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పం. ప్రభుత్వపరంగా నరేంద్ర మోదీ నేడు జల్ జీవన్ మిషన్ పథకాన్ని తీసుకువస్తే.. ఏ ప్రభుత్వం ఆలోచన చేయని రోజుల్లో ఓ ఆధ్యాత్మిక గురువుగా ప్రజల దాహార్తిని తీర్చాలన్న ఆలోచన శ్రీ సత్యసాయి బాబా వారు చేశారు. జల్ జీవన్ మిషన్ పథకానికి శ్రీ సత్యసాయి బాబా వారు ఎప్పుడో అంకురం వేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజల దాహం తీర్చాలన్న ఆలోచన వచ్చిన తరువాత శ్రీ సత్యసాయి బాబా వారు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలియచేశారు.


2







## పుట్టపర్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందుకు

# ధన్యవాదాలు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కృతజ్ఞతలు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆహ్వానం



పుట్టపర్తి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 19 : పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సాస్కీ పథకం నుంచి రూ.35 కోట్ల నిధులు కేటాయించినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆ నియోజకవర్గ శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రహదారి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. శ్రీ సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ తో బుధవారం మధ్యాహ్నం ఇరువురు నేతలు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని అమడుగూరు, బుక్కపట్నం, కొత్త చెరువు, నల్లమడ, ఓబుల దేవర చెరువు తదితర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి చేరే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ నియోజకవర్గం పరిధిలో 19 రోడ్లు, 72 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా నిధులు కేటాయించిన విషయం విదితమే.

# జల్ జీవన్ మిషన్‌కి బీజం వేసింది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా





ఆ సత్కార్యానికి ప్రభుత్వపరమైన అనుమతులను ముఖ్యమంత్రి చంద్రబాబు సత్వరం అందేలా చూశారు. నేడు ఆ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందుతోందని చెప్పారు. ఆధ్యాత్మిక తేజస్సు, విశ్వప్రేమ ఉన్న వ్యక్తుల వల్లే ఇది సాధ్యమన్నారు. బుధవారం పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శతజయంతి ఉత్సవాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గొప్ప ఆధ్యాత్మిక తేజస్సు కలిగిన వారు. భారత దేశంలో, మన రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లా, విపరీతమైన నీటి కొరత ఉండే జిల్లా, ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్లే జిల్లాలో ఆయన పుట్టారు. మహానుభావులు మాత్రమే అలాంటి జన్మను తీసుకోగలరు. శ్రీ సాయిబాబా వారి గొప్పదనం గురించి మన దేశస్తులకంటే విదేశీయులే ఎక్కువ చెబుతారు. 30 ఏళ్ల క్రితం సింగపూర్ లోని చైనీస్ ఇళ్లలో శ్రీ బాబా వారి ఫోటోలు చూశాను. స్టీవెన్ సిగాల్ అనే హాలీవుడ్ నటుడు బాబాని కలవాలన్న తన కోరికను అన్నయ్య చిరంజీవికి చెప్పి ఇక్కడికి వచ్చి బాబా వారి ఆశీర్వచనం తీసుకువెళ్లడం అప్పట్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. 40 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి విదేశీ భక్తులు వస్తారని, ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడతారని ఎవరూ ఊహించరు. శ్రీ సత్యసాయి బాబా వారి ఆధ్యాత్మిక శక్తితోనే అది సాధ్యపడింది.

**- శ్రీ బాబా వారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తాం**

శ్రీ సాయిబాబా వారి సేవాతత్పరతకు ప్రభావితం అయిన వారి సంఖ్య లెక్కలకందదు. పుట్టపర్తి వచ్చి సేవ చేసే ప్రముఖులను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒక వ్యక్తి సచిన్ టెండూల్కర్ లాంటి ఎంతో మంది ప్రముఖులను ప్రభావితం చేశారు. అలాంటి అరుదైన ఆధ్యాత్మిక శక్తి మన భారత దేశంలో, మన రాష్ట్రంలో, మన అనంతపురం జిల్లాలో పుట్టడం ఎంతో ఆనందం కలిగించే అంశం. ఆయన సేవా స్ఫూర్తిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ముందుకు తీసుకువెళ్తాము అని మాటిస్తున్నామన్నారు.

**- శ్రీ సత్యసాయి మహాసమాధి దర్శనం**

అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి మహా సమాధిని దర్శించుకున్నారు. శ్రీ బాబా వారి బంగారు విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

**- శ్రీ సత్యసాయి బాబా వారి స్మారక నాణెం విడుదల**

శ్రీ సత్యసాయి బాబా వారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన రూ.100 స్మారక నాణాన్ని, పోస్టల్ స్టాంపులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, కింజరపు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మానవ వనరులు, ఐటి, విద్యా, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్, ప్రముఖ క్రికెటర్, భారతరత్న సచిన్ టెండూల్కర్, మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్యరాయ్ బచ్చన్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కందుకూరు,

ఈ నెల 15,16 తేదీలలో కాకినాడలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 8వ క్యాడేట్ మరియు 39వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని తైక్వాండో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మరియు జిల్లా కార్యదర్శి అయిన మాస్టర్ ఎస్కే.అబ్దుల్ సలాం తెలియజేశారు.బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెలలో పంజాబ్ లోని జలంధర్ లో జరగబోవు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.పతకాలు సాధించిన క్రీడాకారులు

సబ్ జూనియర్ కేటగిరి విభాగంలో

ఎన్ హేమలతబి స్వర్ణం,ఎస్.కె హఫ్స బి స్వర్ణం, వి జాహ్నవిబి రజితం,జనని- కాన్సం,

ఎం నాగ జస్వంత్ బి స్వర్ణం

దేవా ఆదిత్య బికాంస్యం,

దేవాన్ చౌదరి కాన్సం ,నయాన్ బి కాంసం ,జైశ్రీరామ్ కాంసం

అగస్త్య సార్థక్ బికాంసం,

కేడెట్ విభాగంలో

ఎస్.కె షోహెబ్ -స్వర్ణం ,యు శరత్ -స్వర్ణం,ఎస్.కె అర్ఫన్ -రజతం

మణికంఠ -కాంశం ,బితిన్ సాయి -కాంసం,వరుణ్ కుమార్ -కాంసం

యశ్వంత్ -కాంసం,షేక్ సోఫియా -స్వర్ణ%శీ% ,షేక్ సమరీన్- రజితం.

సీనియర్ విభాగంలో ఎస్కే షాహిద్ -రజితం ,ఎస్ షేక్ సాహిత్ -కాంసం

వినీత -స్వర్ణం ,లక్ష్మీ హర్షిత- స్వర్ణం

భాను రేఖ -స్వర్ణం, సాయి శ్రీహిత -రజిత ,స్వప్న -రజితం

పూజిత -రజితం,లికిత -కాంస్యం అక్షయయ కాంస్యం,

రజిత -కాంస్యం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మరియు శిక్షకులు సలావుద్దీన్, ముఖేష్ కుమార్, అఖిల్, సుబ్రహ్మణ్యం, ప్రశాంత్ బాబులను జిల్లా అధ్యక్షులు ఉన్న%శీ%.వీరస్వామి,కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం తదితరులు అభినందనలు తెలిపారు.







# స్పాట్ బుకింగ్ 5వేలే...!

**- ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు కీలక నిర్ణయం**

**- అయ్యప్పస్వామి దర్శనం కోసం వచ్చే భక్తలకు నీలక్కల్ వద్ద అన్ని ఏర్పాట్లు**

కేరళ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : శబరిమలలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వామివారి స్పాట్ బుకింగ్‌లను 5వేలకు తగ్గించింది. అంతే కాకుండా అడవి నడక మార్గంలో వస్తున్న భక్తులకు పాస్‌లు జారి చేస్తున్నట్లు తెలిపింది.శబరిమలకు స్వాముల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెన్ కోర్ దేవస్థానం స్పాట్ బుకింగ్‌లను రోజుకు 5 వేలకు తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తొలుత 20వేల వరకూ స్పాట్ బుకింగ్‌లు ఇవ్వాలని దేవస్థానం భావించింది. అయితే భక్తుల రద్దీ దృష్ట్యా స్పాట్ బుకింగ్‌లను సోమవారం వరకు రోజుకు 5వేలకు మాత్రమే పరిమితం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో దేవస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా అడవి నడకమార్గంలో ప్రయాణించే స్వాములు ప్రత్యేక పాసులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తుంది. శబరిమలకు అడవిమార్గంలో వచ్చే భక్తుల పాసులు సైతం 5వేలకు పరిమితం చేయాలని దేవస్థానం భావిస్తున్నట్లు తెలుస్తుంది. బుకింగ్‌లకుగాను ఒక కౌంటర్ పంప వద్ద మరో 7 కౌంటర్లు నిలక్కల్ వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపింది. భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని అవసరమైతే స్పాట్ బుకింగ్‌లు 10వేలకు పెంచుతామని తెలిపింది. మ్నెదట వచ్చిన భక్తులకే పాస్‌లు లభిస్తాయని ప్రకటించింది.

అయ్యప్పస్వామి దర్శనం కోసం వచ్చే భక్తలకు నీలక్కల్ వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని భక్తులకు తాగునీరు, టీ ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. పంపా చేరుకొని స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులందరూ నిర్ణిత సమయంలో తిరిగి వెనక్కి రావాలని పేర్కొన్నారు.

## ఈలి గోపాలాన్ని అభినందించిన వైఎస్ఆర్సిపి నాయకులు.

కడియం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుంది అనడానికి తన పదవి నిదర్శనమని ఈలి గోపాలం అన్నారు. కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు,కడియం మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ ఈలి గోపాలరావుని జిల్లా రైతు విభాగ జనరల్ సెక్రటరీగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన మాజీ ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రివర్యులు తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ గృహానికెళ్ళి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపానన్నారు . ఈలి గోపాలరావుని మండలంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు అభినందించారు.

# పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్ చేసిన -ఎస్ ఐ అంకమ్మ

ఉలవపాడు, , నవంబర్ :-19

ఉలవపాడు మండల, టెంకాయ చెట్ల పాలెం గ్రామంలో ఉదయం 6. 00 గంటల సమయంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 68.350 /- నగదును స్వాధీనం చేసుకోవడమైనది ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ కె అంకమ్మ, మరియు సిబ్బంది పాల్గొన్నారు.







## దేశవ్యాప్తంగా 70మంది ప్రఖ్యాత మహిళలు, సాంస్కృతిక సంస్థలకు

# 'స్త్రీ శక్తి ప్రతిభ అవార్డులు-2025'

**- ప్రచారం మీడియా ఆధ్వర్యంలో భారీ స్థాయి సాంస్కృతిక వేడుక**



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : భారతదేశంలోని ప్రతిభావంతమైన మహిళలు, సామాజిక సేవా సంస్థలు, సాంస్కృతిక సంస్థలను గౌరవించేందుకు ప్రచారం మీడియా ఈ సంవత్సరం 'స్త్రీ శక్తి ప్రతిభ అవార్డులు%-%2025' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఎన్నుకోబడ్డ 70మంది అసాధారణ మహిళలు మరియు సంస్కృతి%-%జ్ఞాన పరిరక్షణలో ముందుండే సంస్థలు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కోసం ఎంపికయ్యాయి. ప్రచారం మీడియా వ్యవస్థాపకుడు %ఆ% సిఈఓ ఎం.డి.నాయుడు ఈ కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తూ, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అపారమని, వారి కృషిని జాతీయ స్థాయిలో గుర్తించడం సంస్థ యొక్క లక్ష్యం అని పేర్కొన్నారు. మహిళా శక్తి, విద్య, సంస్కృతి, సేవ, నాయకత్వం, కళల రంగాల్లో విశేషంగా పనిచేసిన వ్యక్తులు మరియు సంస్థలు ఈ అవార్డులకు ఎంపిక చేయబడ్డాయి.ఈ భారీ వేడుక డిసెంబర్ 22%-%23, 2025 తేదీల్లో మల్లా రెడ్డి యూనివర్సిటీ, హైదరాబాద్లో జరుగనుంది. వివిధ రాష్ట్రాల నుండి ప్రముఖులు, విద్యావేత్తలు, సామాజిక సేవకులు పాల్గొనబోతున్నారు. ఎంపికైన ప్రతిభావంతులకు ప్రత్యేకంగా సత్కారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ సమయాలు మరియు వివరాలను త్వరలో ప్రచారం మీడియా ప్రకటించనుంది. ఈ అవార్డులు మహిళా సాధికారతను, భారతీయ సాంస్కృతిక విలువలను, మరియు జ్ఞాన పరిరక్షణను ప్రోత్సహించేలా ఉండనున్నాయి.



# తణుకు పురుషుల శాఖా గ్రంథాలయంలో ఇందిరా గాంధీకి ఘనమైన నివాళి

తణుకు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి "భారత ఉక్కు మహిళ"గా ప్రసిద్ధి చెందిన భారత మాజీ ప్రధాని "భారత రత్న ఇందిరా గాంధీ నిరంతరం శ్రమించారనీ, మహిళా సాధికారతకు విశేష కృషి చేసారని ప్రభుత్వ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సంకు మనోరమ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సంలో సంకు మనోరమ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సంకు మనోరమ చందమామ కథల పుస్తకాన్ని లైబ్రరీకి బహూకరించారు. తొలుత సభకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. సభకు మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌరు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సభావేదికను స్థానిక శ్రీ మారుతీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. పద్మజ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు మునుకుట్ల ఉమాజ్యోతి, ప్రముఖ కవయిత్రి జవ్వాది లక్ష్మి, గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు ప్రభృతులు అలంకరించారు. ముందుగా ఇందిరా గాంధీ చిత్ర పటానికి సంకు మనోరమ పుష్పమాల అలంకరించగా, సభా వేదికను అలంకరించిన ఆహ్వానితులు, సభాసదులు ఇందిరా గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ మరియు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్ మాట్లాడుతూ తాను ఇందిరా గాంధీని 1977 మార్చి నెలలో జరిగిన సాధారణ ఎన్నికల ప్రచార సమయంలో నెల్లూరు జిల్లా కావలి వచ్చిన సందర్భంలో చూసాననీ, ఆనాడు వారు బహిరంగ సభలో అద్భుతంగా హిందీలో ప్రసంగించారని చెప్పారు. శ్రీ మారుతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.పద్మజ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ భక్తి కలిగిన పరిపాలనాదక్షురాలని ప్రశంసించారు. రిటైర్డ్ తెలుగు పండితులు వాడపల్లి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు శ్రద్ధగా విద్యను అభ్యసించాలని హితవు పలికారు. ప్రముఖ కవయిత్రి జవ్వాది లక్ష్మి, సినీ గేయ రచయిత పప్పొప్పు విజయలక్ష్మి, పీయంపీ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, వారి కుమార్తె చి.ఎస్.శ్రావణి తమ పాటలతో సభను అలరించారు. సభలో పప్పొప్పు విజయలక్ష్మి ఒక వంద పుస్తకములు గ్రంథాలయానికి బహూకరించారు. రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు పెన్నులు



బహూకరించారు. సభలో చివరిగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ తరపున సంకు మనోరమను చీకటి శ్రీనివాసరావు, మునుకుట్ల ఉమాజ్యోతి, గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు ప్రభృతులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సభలో ఇంకా రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, ప్రముఖ కవి వి.ఎస్.వి.ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మహమ్మద్ స్వాలీహా, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ రాగాల పృథ్వీ నారాయణ, యన్.కృష్ణానందం, భాస్కర్ల శ్రీపద్మ ప్రియ, బి.మణి, సీహెచ్.శ్రీను ప్రభృతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనాటి ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు దేశభక్తి గేయం పోటీలు నిర్వహించారు. మునుకుట్ల ఉమాజ్యోతి వందన సమర్పణతో నాటి సభ ముగిసింది.

# వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**- రూ.1.16 కోట్లతో నిర్మించనున్న టెన్జెల్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన - ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా శరవేగంగా వాడపల్లి అభివృద్ధి**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : భారతదేశంలో పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని వైజాగ్ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో కలిసి వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే బండారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం వద్ద రూ.1.16 కోట్లతో నిర్మించనున్న టెన్జెల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం గతంలో కన్నా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో రూ.96కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఎమ్మెల్యే బండారు తెలిపారు. వాడపల్లి చారిత్రక నాటి ఆలయంగా కనిపిస్తుందని, స్థానిక నాయకుల కృషితో గణనీయంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. గతంలో ఒకే క్యూలైనుకు అవకాశం ఉన్న ద్వారాలను వెడల్పు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకులను ఆకర్షించడంలో దేశంలో 3వ స్థానంలో ఏపీ ఉందని, ఎక్కువగా ఆధ్యాత్మిక పర్యాటకానికి మన రాష్ట్రానికి పర్యాటకులు వస్తున్నారన్నారు. తిరుమల, సింహాచలం, విజయవాడ మొదలైన దేవాలయాలతో పాటు వాడపల్లి కూడా ఆ స్థాయిలో అభివృద్ధి సాధించడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమ్మక్క - సారలమ్మ జాతరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు పాల్గొనాలి

**- తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు పిలుపు**



ఏటూరునాగారం డివిజన్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క- సారాలమ్మ రెండేళ్లకు ఒకసారి జరిగే ఆదివాసీ జాతరలో 2006 నుండి ప్రతి జాతరకు మేడారం కేంద్రంలో ఆదివాసీ తెగల సమ్మేళనం ఆదివాసీ సంఘాలు జరపడం ఆనవాయితీగా వస్తున్నదని, అదే విధంగా 2026 జనవరిలో జరిగే సమ్మక్క- సారాలమ్మ జాతర సందర్భంగా జనవరి నెల 7వ తేదీనాడు ములుగు జిల్లా ఆదివాసీ సంఘాల జాక్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రజలు, ఆదివాసీ సంఘాలు తెగల సమ్మేళనంలో పాల్గొనాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మేడారంలో సమ్మక్క - సారాలమ్మ గుడి నిర్మాణం చాలా ప్రతిష్టాత్మకంగా చెపడుతుంటే, ములుగు జిల్లాలోని కొందరు అధికారులు పనిగట్టుకొని స్థానిక గుడి పూజరులకు, స్థానిక మంత్రి సితక్కకు చెడ్డపేరు తెచ్చేవిదంగా జాతరను విఫలం చేసే ప్రయత్నంలో భాగంగా గుడి శిల్పకారులకు బాడ్జ్ నుండి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల ములుగు జిల్లా జాక్ చైర్మన్ దబ్బకట్ల సుమన్, ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏ.ఎస్.యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్, మహిళ జిల్లా చైర్మన్ చేలా శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం "కాటన్" విగ్రహం

**- రూ 5 లక్షలతో నిర్మాణం... ఇదీ గోదారోళ్ల మమకారం**

ఆలమూరు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయాలను నిర్మించే వాళ్ళని చూస్తుంటాము. లేదా ఆలయాల నిర్మాణానికి వారి పేరున అధిక విరాళాలు ఇచ్చే వారిని చూస్తాము. కాని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం సందిపూడిలో దొడ్డా సత్తిపండు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అయిదు లక్షల రూపాయలతో డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని భారీ విగ్రహాన్ని నిర్మించారు. ఇందులో పెద్ద విశేషమేముంది చాలామంది గోదావరి జిల్లాలో ఇటువంటి విగ్రహాలను రైతు కుటుంబాలు ఏర్పాటు చేస్తూ ఉంటారు కదా అనుకోవచ్చు. కాని ఇతనికి సెంటు భూమి కూడా లేదు. అలాగని కౌలు వ్యవసాయం కూడా చేయడు. మరి ఎందుకు ఆయనంటే అంత అభిమానం అంటే తండ్రికిచ్చిన మాట. సత్తిపండు తండ్రి దొడ్డా వెంకయ్య కూడా వ్యవసాయం చేసేవాడు కాదు. చిన్న కుటుంబం. ఎడ్లు బండి తోలుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఎప్పుడూ ఈ గోదావరి జిల్లాలు పచ్చదనంతో విరాజిల్లుతున్నాయంటే అందుకు ధవళేశ్వరంలో ఆనకట్ట కట్టిన కాటన్ దేవుడేనని, ఎప్పటికైనా సంధిపూడిలో ఆయన విగ్రహం కట్టాలని చెబుతుండేవాడు. అదే సత్తిపండులో నాటుకు పోయింది. తల్లిదండ్రులు వెంకయ్య, భూలోకం జ్ఞాపకార్థం ఎప్పటికైనా ఈ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈయనది కూడా చిన్న కుటుంబం. ఇటుకల అమ్మకాలు చేస్తుంటాడు. సొంతంగా ఇటుక బట్టీ కూడా లేదు. అయినప్పటికీ తన ముగ్గురు కుమార్తెలకు వివాహం చేసిన అనంతరం ఈ విగ్రహ నిర్మాణానికి పూనుకున్నాడు. అయితే ఆర్థికం స్థోమత అంతగాలేని సత్తిపండు ఈ పెద్ద కార్యక్రమం చేస్తుండటంతో పలువురు దాతలు ముందుకు వచ్చి రూ.2లక్షలు వరకూ విరాళాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. అయితే అతను తీసుకోలేదు. తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం సొంతంగా ఈ భారీ విగ్రహాన్ని నిర్మించి అక్కడ చిన్న పార్కును కూడా ఏర్పాటు చేసారు. విదేశీయుడైన కాటన్ చేసిన మేలుకు విగ్రహం ఏర్పాటు చేసిన తీరు ఇప్పుడు ఈ ప్రాంతంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. గోదారోళ్ల మమకారం అంటే ఇలాగే ఉంటుందని సత్తిపండు చాటి చెప్పాడని పలువురు ప్రశంసిస్తున్నారు.






# 'అన్నదాత సుఖీభవతో' రైతులకు భరోసా

**: కూటమి నాయకులు - మురారిలో జగ్గంపేట నియోజకవర్గం రెండో విడత రైతులకు నిధులు విడుదల**



జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 19 : జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారి గ్రామంలోని కాకతీయ ఫంక్షన్ హాల్ లో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ ప్రారంభించారు. రైతులు పండించే పంటకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం - పిఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని వారు అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ఆర్థిక భరోసాని ఇస్తుందని అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రైతులు, కూటమి నాయకులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగాపోతుల మోహనరావు, తుమ్మలపల్లి రమేష్, అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడుతూ సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, భూమి సాగు చేసుకునే కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.6 వేలు ఆర్థిక సహాయం రైతులకు అందజేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ ద్వారా జగ్గంపేట నియోజకవర్గంలో మొదటి విడత 30.371, రెండవ విడత 30820 మంది మొత్తం61,191 రైతులకు రైతులకుగానూ 41 కోట్ల 21 లక్షలు నిధులు జమ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మూడు విడతలలో రైతులకు రూ.20 వేలు అందజేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. అన్నదాత కుటుంబాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో జగ్గంపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. సంక్షేమం అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తోట రవి, అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, జాస్తి వసంత్, పైడిపాల సూరిబాబు, తోట గాంధీ, కంటిపూడి సత్యనారాయణ, చావా చౌదరి, కందుల కొండయ్య చౌదరి (బాబ్జి) దాపర్తి సీతారామయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, గండేపల్లి జగ్గంపేట కిర్లంపూడి గోకవరం వ్యవసాయ అధికారులు, జగ్గంపేట ఉద్యాన అధికారిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మరో వివాదంలో నటుడు ధనుష్

## -టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు



నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు, 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు.

అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని
వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.




# వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది.

'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

# ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్–మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

# డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి

## -సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి

ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక



సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'ఆరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. అనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు.విశ్వనాథ్ సినిమాల్లో ఎక్కువగా నటించిన తులసికి బాలనటిగా శంకరాభరణం ఎనలేని కీర్తిని తీసుకు వచ్చింది. ఆ తర్వాత చిరంజీవి హీరోగా వచ్చిన శుభలేఖ సినిమాలో సుధాకర్‌కు జోడీగా మెప్పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.






Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com